# ‘‘అది సరేగానీ ఇదేమిటీ?’’

‘‘చంద్రమతి మాంగళ్యం అంటే ఏమిటి గురూ?’’ నవ్వుతూనే అడిగాడు అజ్ఞానం.

‘‘ఏనాటిదో చంద్రమతి. ఆమె మాంగళ్యం గురించి నీకిప్పుడు తెలుసుకోవాలని ఎందుకు బుద్ధి పుట్టింది?’’ అన్నాను నేను, ఆశ్చర్యపోయి.

‘‘అది కాదు గురూ! ‘ప్రతిఘటన’ సినిమాలో విజయ శాంతి పాడిన ఒక పాటలో ఆ మాట వినిపించింది. అదేమిటో అర్థంకాక నిన్నడుగుతున్నా చెప్పు గురూ!’’

ఆ సినిమాలో రౌడీలు నడివీథిలో తనను దిగంబరిని చేసిన విషయాన్ని దృష్టిలో వుంచుకుని వాళ్ళకి జవాబుగా విజయశాంతి ఒక పెద్ద పాట ఉత్తేజకరంగా పాడుతుంది. స్త్రీ మానమెంతటి విశిష్టమైనదో, పవిత్రమైనదో ఉద్ఘోషిస్తుందా పాటలోని భావం. దాన్ని కొత్త డొక్క శుద్ధి గల వేటూరి వ్రాశాడు కనుక అదొక మామూలు అల్లాటప్పా సినిమా పాటగా



గాక, అద్భుతమైన భావ ఖండికగా ‘హిట్’ అయిందని నేనప్పుడే అనుకొని అభినందించాను.

అందులో అతను యాస్ట్‌గా వాడిన పదాల్లో ఈ ‘‘చంద్రమతి మాంగళ్యం’’ అన్న పదం ఒకటి. కాని, అది ఈనాటి జనానికి ఇంత అర్థం కాని విషయమవుతుందనుకోలేదు.

‘‘హరిశ్చంద్రుని కథ తెలుసా నీకు?’’ అనడిగాను అజ్ఞానాన్ని.

‘‘నాకెందుకు తెలీదు? ఆయన పెళ్ళామేగా చంద్రమతి!’’ అని సగర్వంగా తలెగరేశాడు అజ్ఞానం.

ఆ జవాబు కొంత తృప్తి కలిగించింది నాకు. ఫర్వా లేదనుకుని ప్రారంభించాను.

‘‘హరిశ్చంద్రుడు కాటి కాపరిగా వున్నప్పుడు చంద్రమతి పాముకాటువల్ల చచ్చిపోయిన కొడుకును దహనం చేయడానికి శ్మశానికి తీసుకు వెళ్తుంది కదా! అప్పుడు ఆ కాటికాపరి హరిశ్చంద్రుడని ఈమెకూ, ఈమె చంద్రమతి అని హరిశ్చంద్రుడికీ తెలియదట! అందుకని హరిశ్చంద్రుడు కాటి సుంకం చెల్లించనిదే శవాన్ని కాల్చడానికి వీల్లేదంటాడు. నా దగ్గర పైసా కూడా లేదని చంద్రమతి విలపిస్తుంది. సొమ్ము లేక పోవచ్చుగానీ, నీ మెడలో బంగారు మాంగళ్య మగుపిస్తున్నది కదా — దాన్ని కుదువ పెట్టో అమ్ముకునో కాటి సుంకం చెల్లించు అంటాడు హరిశ్చంద్రుడు.

అతని మాట విని చంద్రమతి విస్మయ చకితురాలవుతుంది. ఎందుకంటే — ఆమె మహా పతివ్రతల్లో జమ అయినట్టినది. ఆమె మాంగళ్యానికో ప్రత్యేకత వుంది. అది ఆమె భర్తకు తప్ప అన్య పురుషులకు కనిపించదట! అంతటి అపూర్వమైన మాంగళ్యం ఆ కాటి కాపరి కళ్ళకెలా కనబడిందని చంద్రమతి ఆశ్చర్యపోయి, అప్పుడు అతను తన భర్తేనని గుర్తించిందట!... ఇదీ ‘చంద్రమతీ మాంగళ్యం’ విశేషం!... తెలిసిందా?’’ అని అడిగాను నేను.

‘‘అట్లాగా?’’ అన్నాడు అంతవరకూ నోరు తెరచి విన్న అజ్ఞానం. ‘‘అంటే ఆడదాని మానం భర్తకు తప్ప పర పురుషుల కంట పడనట్టిదని చెప్పడానికా సినిమా కవి ఆ పాటలో ఆ మాట వాడాడన్నమాట!’’ అన్నాడా తర్వాత.

‘‘యు ఆర్ కరెక్ట్!’’ అని నేనతన్నభినందించాను.

అజ్ఞానం కాస్సేపాగి, ‘‘అయితే గురూ, ఈనాడు చాలా మంది ఆడవాళ్ళే మంగళ సూత్రాన్ని, ‘చూడండహో!’ అన్నట్టుగా చీరపైన వేసుకుని మరీ తిరుగుతున్నారే — వాటినేమనుకోవాలి?’’ అని ప్రశ్నించాడు.

అప్పుడు ఆ ప్రశ్నకు జవాబు ఏం చెప్పాలో తెలీని అజ్ఞానిని నేనైపోయాను. ఇంకేం చెప్పేది?

— బేబీ బాబు




